క్లుప్తంగా

రేపటి నుంచి జాతీయ స్థాయి ఎడ్ల పందేలు

వేంసూరు: మండలంలోని కందుకూరులో శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల సందర్భంగా గొర్ల సత్యనారాయణరెడ్డి(బుల్లి బాబు) జ్ఞాపకార్థం ఈ నెల 13 నుంచి 15 వరకు జాతీయ స్థాయి ఒంగోలుజాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మూడు కేటగిరీల్లో మొదటి నుంచి ఎనిమిది స్థానాల్లో నిలిచే ఎడ్లకు నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పోటీల పోస్టర్లను మంగళవారం కమిటీ సభ్యులు గొర్ల వెంకటప్పరెడ్డి, కొప్పుల వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మారెడ్డి, ఈశ్వరాచారి, నాగరాజు ఆవిష్కరించారు.

మిత్రుడికి సాయం



నగదు అందజేస్తున్న మిత్రులు

ఏన్కూరు: కష్టాల్లో మిత్రుడికి తోటి మిత్రులు సాయమందించారు. మండలంలోని టీఎల్ పేటకు చెందిన తాళ్లూరి శ్రీనివాస్ కూతురు మణితేజ ఇటీవల మృతి చెందగా శ్రీనివాస్‌తో చదువుకున్న మిత్రులు మంగళవారం రూ.30 వేలు నగదు, బియ్యం శ్రీనివాస్ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబు, కొంగర చంద్రయ్య, నెమ్మకంటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి..

తల్లాడ: మండలంలోని గొల్లగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి మాజీ సర్పంచ్ నారపోగు వెంకటేశ్వరరావు మంగళవారం రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. వంకాయల పుల్లయ్యకు రూ.10 వేలు, పగిడిపల్లి చిన్న జేమ్స్‌కు రూ.10 వేలు, ఇస్నేపల్లి బక్కయ్యకు రూ.5 వేలు, గొల్లమండల ఏసోబుకు రూ.5 వేలు నగదు అందజేశారు

దొరికిన బ్యాగ్ అప్పగింత

మధిర: మండలంలోని సిరిపురానికి చెందిన కనకపుడి గోపాల్‌కు చింతకాని మండలం నాగులవంచ వద్ద బ్యాగ్ దొరకగా ఆ బ్యాగును మంగళవారం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఐపీఎస్ అధికారి రుత్విక్ సాయికి అందజేశారు. ఖమ్మంకు చెందిన చింతలపాటి పార్థసారథి విజయవాడ నుంచి ఖమ్మం వెళ్తుండగా విలువైన పత్రాలు, వస్తువులు ఉన్న బ్యాగును పోగొట్టుకోగా గోపాల్‌కు బ్యాగ్ దొరకడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. సదరు వ్యక్తి వివరాలు తెలుసుకుని బ్యాగును పోలీసులు బాధితుడికి అప్పగించారు.

గోటి తలంబ్రాలు సిద్ధం

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం గ్రామానికి చెందిన కొంతమంది తమ పొలంలో పండించిన వడ్లను గోటితో వలిచి గోటి తలంబ్రాలు తయారు చేసి వాటితో కాలినడకన భద్రాచలం బయలు దేరారు. సీతారామచంద్రస్వామి కల్యాణానికి తమ వంతు సాయంగా గోటి తలంబ్రాలను దేవస్థానానికి అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

బహుమతులు అందజేత

ముదిగొండ: మండలపరిధిలోని వల్లభి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువకేంద్రం, ప్రజ్వల యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్‌డే నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శోభ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అడ్డగింత

మధిర: ఎండపల్లి గుట్ట నుంచి మట్టి తోలకాలు చేపట్టడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని మంగళవారం మట్టి తరలిస్తున్న వాహనాలను రొంపిమళ్ల, మల్లవరం గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... భారీ వాహనాలతో రోడ్డు గుంతలమయంగా మారిందని, తరచూ ప్రమాదాలు సమస్యను పరిష్కరించేందుకు అధికారులు, కాంట్రాక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు.

విద్యాభివృద్ధి సాధించాలి



సామగ్రి అందజేస్తున్న నర్సింహారావు

చింతకాని: కష్టపడి చదివి విద్యాభివృద్ధిని సాధించాలని శ్రీ సత్యసాయి సేవా స మితి జిల్లా బాధ్యులు ఆలస్యం నర్సింహారావు తెలిపారు. మండల పరిధిలోని పాతర్లపాడు పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సమితి సభ్యులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు మంగళవారం పంపిణీ చేశారు. సమితి జిల్లా సభ్యులు ఆదినారాయణ, హెచ్‌ఎం రాజయ్య, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎదుర్కోలు

వేంసూరు: మండల పరిధిలోని కందుకూరు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం రాత్రి శ్రీ స్వామి వారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు.

భారంగా మారిన నిర్వహణ

రైతువేదికలకు రెండున్నరేళ్లుగా అందని నిధులు

- ఇబ్బందుల్లో ఏఈఓలు



చింతకాని రైతువేదిక

చింతకాని: రైతులకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండి సాగులో అవలంబించాల్సిన పద్ధతులపై సలహాలు, సూచనలు అందించేందుకు గాను గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతువేదికలు అక్కరకు రాకుండా పోతున్నాయి. రెండు, మూడు రెవెన్యూ గ్రామాలను ఒక క్లస్టర్‌గా చేసి క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతువేదికలను నిర్మించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షలు వెచ్చించి 129 రైతువేదికలను నిర్మించినా నిర్వహణకు మాత్రం సకాలంలో నిధులను విడుదల చేయడం లేదు. దీంతో వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓ) తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్యం, ఇతర నిర్వహణ ఖర్చులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పంటల సాగులో రైతులకు సూచనలు అందజేస్తారు.

రెండున్నరేళ్లుగా రాని నిధులు..

ఒక్కో రైతువేదిక నిర్వహణకు నెలకు రూ. 9 వేలు చొప్పున ఖర్చవుతుందని గత ప్రభుత్వం అంచనా వేసింది. వాటిలో విద్యుత్ బిల్లులకు రూ.1,000, రైతుల శిక్షణకు రూ.2,500, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.3,000, తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్సులు, ఇతర ఖర్చులకు రూ.2,000 కేటాయించారు. ఈ మేరకు రైతు వేదికలకు గతేడాది ఏప్రిల్ వరకు నిధులు విడుదలయ్యాయి. రెండున్నరేళ్ల నుంచి నిధులు నిలిచిపోవటంతో రైతువేదికల నిర్వహణ భారంగా మారిందని ఏఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు, స్టేషనరీ, స్వీపర్‌కు వేతనాలు చెల్లించడం ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న రైతు వేదికల నిర్వహణ నిధులను త్వరగా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

నిధులు రావాల్సి ఉంది..



రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను విద్యుత్ బిల్లులు, పారిశుధ్య నిర్వహణ, రైతులకు శిక్షణ, తాగునీరు, తదితర వాటికి ఖర్చు చేస్తున్నాం. రైతు వేదికల నిర్వహణకు సంబంధించిన పెండింగ్ నిధులు గత రెండున్నరేళ్ల నుంచి రావల్సి ఉంది.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

నిధులు రాకుంటే నిరుపయోగమే..



రైతువేదికలకు నిర్వహణ నిధులను ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలి. నిధులను విడుదల చేయకపోతే రైతువేదికలు నిరుపయోగంగా మారతాయి. రైతులకు పంటల సాగులో సూచనలు, సలహాలను అందించేందుకు సమావేశాలను నిర్వహించే పరిస్థితి ఉండదు.

– కాశిబోయిన శ్రీనివాసరావు, రైతు, మత్కేపల్లి

ఐక్యతతో సమస్యల పరిష్కారం



వెంకన్నను సన్మానిస్తున్న సంఘం నాయకులు

మధిర: నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న అన్నారు. మంగళవారం మధిర పట్టణంలో సంఘం భవన శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక రిక్రియేషన్ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్పొరేషన్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వం ద్వారా అనేక ఫలితాలు పొందాల్సి ఉందన్నారు. అనంతరం వెంకన్నను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘ ఐక్యవేదిక అధ్యక్షుడు తూముల నాగభూషణం, నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు, మాదారపు హరినాథ్, మునుగోటి వెంకటేశ్వరరావు, గుండెమెడ బాలాజీ, లింగంపల్లి అప్పారావు, ఆలేటి నరసింహారావు, వేముల శంకర్, ఆదిమూలం పుల్లారావు, ఓగిరాల వాసు తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములకూ నీరు..

బోనకల్: చివరి భూముల వరకు నీరు అందిస్తామని, సాగునీటిని వృథా చేయవద్దని తహసీల్దార్ పున్నం చందర్ కోరారు. మండల పరిధిలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్, ఆళ్లపాడు మైనర్ కాల్వను మంగళవారం కాల్వపై ఉన్న అడ్డులను తొలగించారు.

ఫౌంటెన్ కాదిది..!



వైరా : ఫౌంటెన్ మాదిరి ఎగజిమ్ముతున్న నీరు

వైరా: వైరాలోని మధిర రోడ్డులో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. ఈక్రమాన మంగళవారం జేసీబీతో రోడ్డు పక్కన మట్టిని తొలగిస్తుండగా ఎయిర్‌వాల్‌కు తాకడంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. దీంతో ఫౌంటెన్ మాదిరి నీరు పైకి చిమ్మింది. ఈమేరకు సమాచారం అందుకున్న సిబ్బంది కాసేపటికి సరఫరా నిలిపివేశారు.

పైప్‌లైన్‌కు లీకేజీ

మధిర: మధిరలోని రైల్వే గేట్ సమీపాన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకయ్యింది. మూడు లైన్ నిర్మాణంలో భాగంగా రైల్వేగేట్ సమీపాన డ్రిల్లింగ్ చేస్తుండగా అక్కడే ఉన్న పైప్‌లైన్‌కు రంధ్రం పడింది. ఈ క్రమాన మరమ్మతులకు నాలుగు రోజులు పడుతుందని, దెందుకూరు, ఖమ్మంపాడు, చిలుకూరు, రాయపట్నం, మహదేవపురం, ఇల్లూరు, దేశినేనిపాలెం, మడుపల్లిలకు నీటి సరఫరా ఉండదని సిబ్బంది తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

పెనుబల్లి: మండలపరిధిలోని కెయం బంజర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. నాయకులు ఆనంద్‌బాబు తదితరులు ఉన్నారు.

వారబందీ ఎత్తివేయాలి



వరి పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కొణిజర్ల: రాపల్లె మేజర్‌కు నీరు విడుదల చేయకపోవడంతో చివర భూములు నీరందక ఎండిపోతున్నాయని, వారబందీ లేకుండా సాగర్ జలాలు ఏప్రిల్ చివరి వరకు విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెద్దమునగాలలో సంఘం నాయకులు పంటలను పరిశీలించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు దేరంగుల లక్ష్మయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ సత్తుపల్లికి మంజూరు చేయటాన్ని హర్షిస్తూ ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అర్వపల్లి సందీప్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. నాయకులు రాజు, తేజ, యశ్వంత్, వెంకి, ప్రదీప్, శ్యామ్ ఉన్నారు.

సాగునీరు అందించాలని మంత్రికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వైరారూరల్: వారబందీని సడలించి సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోని అఖిల పక్ష రైతుసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో 80 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేసిన రైతులు కనీస మద్దతు ధర తీవ్రంగా నష్టపోయారని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు చొరవ చూపి, మిర్చి క్వింటాకు రూ. 25 వేల మద్దతు ధర ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతు రుణమాఫీ, రైతుభరోసాలను వెంటనే విడుదల చేయించాలన్నారు. బొంతు రాంబాబు, శ్రీనివారావు, నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, కట్టా దుర్గయ్య తదితరులున్నారు.

పరామర్శ...

ముదిగొండ: మండలంలోని వెంకటాపురం, మేడేపల్లి గ్రామాల్లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పర్యటించారు. మేడేపల్లిలోని మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సతీమణి సామనేని నాగమణి ఇటీవల మరణించడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు మోర్తాల నాగార్జునరెడ్డి, జూలకంటి సంజీవరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, వట్టికూటి సైదులు, బ్రహ్మయ్య, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

మధిర: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉక్కుపాదం మోపుతామని మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ కొట్టె రుత్విక్ సాయి అన్నారు. మంగళవారం మధిరటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్రమ ఇసుక తోలితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని, బెల్ట్ షాపులు బంద్ చేయాలని, కొంతమంది చిరు వ్యాపారులు రోడ్డు మీదకు వచ్చి వ్యాపార లావాదేవీలు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. గంజాయిని అరికట్టేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వర్గీకరణ అయ్యే వరకు నియామకాలు ఆపాలి



బోనకల్: దీక్షలో కూర్చున్న నాయకులు

మధిర: ఎస్సీ వర్గీకరణ చట్టం పూర్తయ్యేంతవరకు ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు బీఆర్ఎస్ నాయకులు చుంచు విజయ్, సీపీఐ నాయకులు సిలువేరు శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో కూర్చున్న వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు కనకపూడి శ్రీను , దోర్నాల ఆంజనేయులు, వేల్పుల పవన్, కొండూరు రాజేష్, కనకపుడి పవన్, రాజారత్నం ఉన్నారు.

బోనకల్: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నాయకులు తోటపల్లి సాల్మన్, చిన్న సైదులు, తాటికొండ వెంకటరత్నం, హనుమంతరావు, ముఖేష్ ఉన్నారు.

ముదిగొండ: స్థానిక తహసీల్ ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్, యువసేన ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్‌లు నూకల నాగేశ్వరరావు, భద్రం, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, అనిల్ తదితరులు ఉన్నారు.

కారేపల్లి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యాన రిలే దీక్షలు ప్రారంభించారు. నాయకులు ఆదేర్ల రాములు, రామారావు, కేశగాని బాలకృష్ణ, శ్రీను, నాగరాజు, బాబు, అనిల్, అనంత్, వెంకన్న, శివ, నాగేశ్వరరావు, శ్రీకాంత్ నాయకులు ఉన్నారు.

ఏన్కూరు: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యంగళ నరేష్ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. నాయకులు వీరయ్య, నాగరాజు, పిల్లలమర్రి రాంబాబు, బాగం బెంజిమన్ , మనోహర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

కారేపల్లి: పట్టపగలే ఇంటి తాళం పగలగొట్టిన దుండుగులు వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మండలంలోని పాటిమీదిగుంపు గ్రామానికి చెందిన రవీందర్ కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి ఇల్లెందు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగలగొట్టి బీరువాలో భద్రపర్చిన ఆరు తులాల బంగారం, 35తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన రవీందర్ కుటుంబీకులు విగ్రహాన్ని గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బోనకల్: ఆంధ్రా నుంచి అక్రమంగా బోనకల్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై మధుబాబు మంగళవారం సీజ్ చేశారు. వత్సవాయికి చెందిన గరిమళ్ల సుబ్బారావు అనుమతులు లేకుండా ఇసుక తోలుతుండగా కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన మండలంలోని క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన సట్టు సత్యం బైక్‌పై వెళ్తుండగా క్రాస్‌రోడ్డ వద్ద ప్రమాదవశాత్తు కిందదపడి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ అంతరాయాలు ఉండొద్దు..



ఎస్ఈ శ్రీనివాసాచారిని సన్మానిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్/కల్లూరు/వేంసూరు: రానున్న వేసవిలో డిమాండ్ పెరగనున్న నేపథ్యాన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఖమ్మం ఎస్ఈ ఈనుగుర్తి శ్రీనివాసాచారి ఆదేశించారు. సత్తుపల్లి డివిజన్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆయన అక్కడ ఉద్యోగులతో సమావేశమయ్యాక గంగారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సత్తుపల్లి డీఈఈ ఎల్.రాములుతో కలిసి తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను అరికట్టడం, ఇతర పనులపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యాలయంలో ఎస్ఈ శ్రీనివాసాచారిని అధికారులు సత్కరించారు. ఆతర్వాత కల్లూరు మండలం లోకవరంలోని మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ, వేంసూరు మండలం లింగపాలెంలో 33 కేవీ లింక్ లైన్ పనులను పరిశీలించి పొలంబాటలో భాగంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఈ బి.ప్రసాద్‌బాబు, ఏఈలు పి.వెంకట్, జి.అంకురావు, శరత్‌బాబు, కావ్య, సుజాత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

- ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి: గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పెనుబల్లి మండలంలో పలు గ్రామాల్లో ఎస్టీ సబ్ ప్లాన్ కింద మంజూరైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆర్డీఓ రాజేందర్ గౌడ్, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి, వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఈఈ రామ్‌కోటి నాయక్, డీఈ ఎ.వెంకటేశ్వరరావు, ఏఈ కె.రమేష్‌బాబు, నాయకులు వెంకటేశ్వరరావు, రామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, బాపిరెడ్డి, మాధవరావు, మాధవరెడ్డి, రాధాకృష్ణ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన...

కల్లూరురూరల్: మండలంలోని మోడల్ గ్రామం తూర్పులోకవరంలో ఇందిరమ్మ గృహాలకు ఎమ్మెల్యే రాగమయి శంకుస్థాపన చేశారు. ఆర్డీఓ రాజేందర్‌గౌడ్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల జ్యోతి, హౌసింగ్ ఏఈ ఎండి అతహర్, ఇరిగేషన్ డి.రత్నాకర్, స్పెషల్ ఆఫీసర్ రత్నమ్మ, నాయకులు యాకూబ్ అలీ, భాగం ప్రభాకర్ చౌదరి, దామాల రాజు, భూక్యా శివకుమార్ పాల్గొన్నారు.

వీవోఏలకు వేతనాలు పెంచాలని వినతి..

ఐకేపీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీవోఏలకు గౌరవ వేతనం పెంచాలని కల్లూరు ఏఎంసీ కార్యాలయంలో ఎమ్మెల్యే రాగమయికి వీవోఏలు వినతిపత్రం అందచేశారు. వీఓఏ (ఏఐటీయూసీ) జిల్లా కన్వీనర్ వేము నాగమణి, మండల గౌరవాధ్యక్షుడు వేము రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్, వీవోఏలు కుమారి, రమాదేవి, కృష్ణవేణి, వెంకట్రావమ్మ, అనూష తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని..

సత్తుపల్లిరూరల్: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, టీయూసీఐ అనుబంధ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్ భాషావలీ, కొత్తగూడెం రీజియన్ అధ్యక్షులు అమర్లపూడి శరత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాగమయికి వినతిపత్రం అందించారు.

సైలోబంకర్ బాధితుల సమస్యలపై స్పందించాలి

సత్తుపల్లి: కిష్టారం గ్రామంలోని అంబేద్కర్‌నగర్ వాసులు సింగరేణి సైలోబంకర్ కారణంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని బీజేపీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ... నిబంధనలు ఉల్లంఘిస్తూ గ్రామానికి సమీపంలో నిర్మించిన ఈ సైలోబంకర్ నుంచి వెలువడే దుమ్మూధూళి ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. సమస్యను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పర్యావరణ శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో ఎన్‌జీటీని ఆశ్రయిస్తామన్నారు.

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి..



మాట్లాడుతున్న కమల్‌రాజ్

ఎర్రుపాలెం: రాష్ట్రంలోని ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని జెడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇనగాలి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపైనే రాష్ట్ర ప్రభుత్వం ఎదురు దాడి చేస్తుందని, కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను పాలకులు వేధిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజా అవసరాల కోసం పనిచేయాలని హితవు పలికారు. మాజీ జెడ్పీటీసీ శీలం కవిత, నాయకులు కృష్ణారావు,యరమల కృష్ణారెడ్డి, వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, నాగనబోయిన కాశేశ్వరరావు, సిద్దారెడ్డి బొర్రా నరసింహారావు, సాహెబ్ తదితరులున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

ముదిగొండ: వరిలో చీడపీడల నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని మధిర ఏడీఏ విజయచంద్ర అన్నారు. మండలపరిధిలోని మాదాపురం రైతు వేదికలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయిల్‌పాం సాగుతో లాభాలు అర్జించవచ్చన్నారు. ఏఓ వేణు, ఏఈఓ రఘు ఉన్నారు.

రుణమాఫీ జాబితా ప్రదర్శన

బోనకల్: మండలంలోని తొమ్మిది సహకార సంఘాల్లో మంగళవారం మూడు విడతల్లో రైతుల రుణాల మాఫీకి సంబంధించిన జాబితాను ప్రదర్శించారు. ముష్టికుంట్ల సహకార సంఘ అధ్యక్షుడు బోయినపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మూడు విడతల్లో రూ. 2లక్షల లోపు రైతులందరికీ రుణమాఫీ అయిందన్నారు. ఏఈఓ త్రివేణి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎస్ సర్వే..



సర్వే పరిశీలిస్తున్న మధుసూదన్‌రావు

కల్లూరురూరల్: మండలంలోని ముచ్చవరం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రాష్ట్ర స్థాయి ఎఫ్ఎల్ఎస్ సర్వే చేపట్టారు. సర్వేలో భాగంగా చెన్నూరు జెడ్పీ హెచ్‌ఎం పోర్లు మధుసూదన్‌రావు ముచ్చవరంలోని పాఠశాలలను సందర్శించి రెండో తరగతి విద్యార్థులకు ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్‌ను పరిశీలించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ సహాయ కార్యదర్శి దంతాల సుధాకర్, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, ఛాంద్‌సాహెబ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.